నమో వైకుంఠనాథ

- నేత్రపర్వంగా ఉత్తర ద్వార దర్శనం
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు


నార్త్ ఎక్స్‌టెన్షన్ ఆలయంలో వెంకన్నకు హారతి సమర్పిస్తున్న అర్చకుడు


లలితా పీఠంలో వెంకన్న దర్శనానికి తరలివచ్చినభక్తులు


లలితాపీఠంలో ఊయలపై ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి


తిక్కవానిపాలెం వెంకన్న ఆలయ పూజల్లో పాల్గొన్న కె.కె.రాజు, గంటా కామరాజు

సీతంపేట: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం నియోజకవర్గంలోని వైష్ణవాలయాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము 4 గంటల నుంచే స్వామి దర్శనం కోసం భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. శ్రీమన్నారాయణుడిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుని తరించారు.

లలితానగర్ లలితా పీఠంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడిని భక్తులు దర్శించారు. స్వామి వారి ఊయల కింద నుంచి వెళ్లి శ్రీవారికి పూజలు చేశారు. ఉత్తర ద్వారం నుంచి రమా సత్యనారాయణ స్వామి, వేంకటేశ్వరస్వామి, పద్మావతి, నరసింహస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు. పీఠంలోని సమస్త దేవతలను దర్శించుకున్నారు. ధనుర్మాస వ్రత నిత్యకైంకర్య సేవలతోపాటు ఊంజల్ సేవ, చందన అంకరణతో స్వామి వారి దర్శనం కల్పించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఆలయ మండపంలో పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వేంకటేశ్వరస్వామి గరుడ వాహనంపై విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు కూర్మనాథాచార్యులు స్వామి, అమ్మవార్లకు పంచామృతా, క్షీరాభిషేకాలు, సహస్రనామార్చన, నక్షత్ర హారతులు ఇచ్చారు.
- అక్కయ్యపాలెం మూడుగుళ్ల వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయం, గోశీలపాలెం రామాలయం, సీతంపేట రాధాకృష్ణ ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు చేశారు. ఆలయ కమిటీల ప్రతినిధులు భక్తులకు తీర్థప్రసాదాలు పంచారు.


గాంధీనగర్-2లో పూజలందుకున్న స్వామి


శ్రీనివాసనగర్ లక్ష్మీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ప్రత్యేక పూజలు, అభిషేకాలు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా దేవాలయంలో వెంకన్నను ఉత్తర ద్వారం నుంచి భారీగా భక్తులు దర్శించుకున్నారు. ప్రసన్న వేంకటేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి బృందంచే స్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో పైలా శేఖర్‌బాబు, సిబ్బంది వనజాక్షి, శివ, ట్రస్ట్ అధ్యక్షులు, సెక్యూరిటీ శ్రీను, కిరణ్‌రాజు, సభ్యులు పాల్గొన్నారు.

మహా పుణ్యఫలం

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్-2లోని పార్వతీ సమేత అమృతలింగేశ్వర స్వామి కొలువైన రామాలయంలో ఉత్తర ద్వార దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. హరిహర క్షేత్రం యువ సేన సేవా సంఘం ఆధ్వర్యంలో అర్చకుడు జయంతి సూర్యశర్మ ప్రత్యేక పూజలు చేశారు.

– ఆర్ అండ్ బీ దరి అప్పయ్యనగర్‌లోని భూ సమేత విజయవేంకటేశ్వరుడిని ఉత్తర ద్వార మార్గం గుండా వేలాది మంది భక్తులు దర్శించుకుని తరించారు. ఆలయ ఈవో పీఎస్ఎన్ మూర్తి విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకుడు జి.సింహం, ఎ.వేణుగోపాలాచార్యులు ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

కలియుగ వెంకన్నకు అభిషేకాలు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ఉత్సవ కమిటీ, అర్చకులు శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తెల్లవారుజాము 4 గంటలకు ఆలయ చైర్మన్ గంటా కామరాజు, గ్రామాధ్యక్షుడు ఎస్.ఎల్లాజీ దంపతులు కలశ ప్రతిష్ఠ, పూజలు చేశారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు వెంకన్నను దర్శించి పూజలు చేశారు. కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు, కాయిత పైడి రత్నాకర్, ఉపాధ్యక్షుడు ఎం.తాతారావు, కార్యదర్శి పట్టిమి రాజు తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాసనగర్ ఆలయంలో గరుడ వాహనంపై శ్రీవారు

చూసిన కనులదే భాగ్యం

- వైకుంఠ నారాయణుడి అవతారంలో వైభవ వేంకటేశ్వరుడి దర్శనం
- వేలాదిగా తరలి వచ్చిన భక్తజనం


వైభవ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి


2తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న కె.కె.రాజు


కోలాటమాడుతున్న చిన్నారులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి ఉత్తర ద్వార దర్శనం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో వైకుంఠ ఏకాదశిని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారు. స్వామిని దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. వేకువజాము 2.30 గంటలకు మంగళధ్వనితో స్వామికి అర్చనలు ప్రారంభమయ్యాయి. 3 గంటలకు సుప్రభాత సేవ నిర్వహించి గోదాదేవి ఉత్సవ విగ్రహంతో ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీరంగనాథుడికి తిరుప్పావై పఠనంలో భాగంగా పాశుర విన్నపం సమర్పించారు. ఆలయ అర్చకులు వాసుదేవాచార్యులు, శేషాచార్యులు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి. 5 గంటలకు స్వామి తిరువీధి ఉత్సవం నిర్వహించిన ఉదయాస్తమాన సేవా భక్తులకు ఆశీర్వచనం చేశారు. స్వామికి పంచామృతాభిషేకాలు జరిపారు.

ప్రశాంత చిత్తుడిగా..

వైభవుడిని గతంలో మాదిరి సర్వాంగ వజ్రకవచంతో కాకుండా వైకుంఠ నారాయణుడిగా, ప్రశాంత చిత్తుడిగా అలంకరించారు. ఉదయం 5.30 గంటలకు శ్రీదేవీ, భూదేవి సమేతుడైన వైభవుడి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఆశీనులు గావించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రసాద నివేదన జరిగింది. 2 నుంచి 3 గంటల వరకు దర్శనాలు నిలిపివేశారు. రాత్రి 9 గంటల వరకు దర్శనాలు కొనసాగాయి. అనంతరం స్వామికి పవళింపు సేవ జరిగింది.

ప్రముఖుల రాక..

విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు స్వాగతం పలికారు. స్వామికి ఆయన పూజలు చేసి మాట్లాడుతూ వైభవుడి క్షేత్రం దివ్యంగా వర్ధిల్లుతుందన్నారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. తిరువీధి ఉత్సవంలో పాల్గొన్నారు. ఆయనతోపాటు డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్ రాజు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజును సత్కరించి వైభవుడి చిత్రపటాన్ని అందించారు. ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు కుటుంబ సభ్యులతో వైభవుడిని దర్శించుకున్నారు. వైభవ్ జ్యూయలర్స్ కంకటాల మల్లిక్ పాల్గొన్నారు.

జన సందోహం..

ఈ సారి వైభవ వేంకటేశ్వరుడి దర్శనానికి సుమారు 70 వేల మంది భక్తులు వచ్చినట్లు అంచనా. వీఐపీ, దర్శనం వద్ద విపరీతమైన రద్దీ ఏర్పడింది. దీన్ని అదుపు చేసేందుకు 250 మంది వలంటీర్లు పని చేశారు. ఈవో బండారు ప్రసాద్ నిరంతర పర్యవేక్షణలో ఆలయ కమిటీల సభ్యుల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మండల, యూత్ వింగ్ అధ్యక్షులు వీరే

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తర నియోజకవర్గంలో పార్టీ మండల, యువజన విభాగం అధ్యక్షులను నియమించినట్లు శనివారం కేంద్ర కార్యాలయం ప్రకటించింది. నియోజకవర్గం క్లస్టర్-1కు ముద్దాడ అశోక్, క్లస్టర్-2కు బైర వెంకట్, క్లస్టర్-3కి కోరువాడ చిన్న, క్లస్టర్-4కు బి.రాజామోహన్, క్లస్టర్-5కు అలజాడ భార్గవ్‌లను అధ్యక్షులుగా నియమించారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కలెక్టర్ అఖిల

సీతమ్మధార: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని డిప్యూటీ కలెక్టర్, ఉత్తర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.అఖిల సూచించారు. శనివారం పలు కళాశాలల్లో ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు ఈవీఎంల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎంలో ఓటు ఎలా వేయాలో వివరించారు. పొరపాటున రెండు సార్లు బటన్ నొక్కితే ఓటు చెల్లదన్నారు. తహసీల్దార్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రామలక్ష్మి, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వోలు పొన్నాడ నాగేశ్వర రావు, మూర్తి పాల్గొన్నారు.

'ఆ సమావేశంతో సంబంధం లేదు'


అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన డాక్టర్ పి.వి.రమణమూర్తి

సీతమ్మధార: ఖారవేల ఎడ్యుకేషనల్ కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్(వైజాగ్ సిటీ కళింగ కమ్యూనిటీ) సర్వసభ్య సమావేశం ఈ నెల 24న జరుగుతుందని కొందరు చేసిన పత్రికా ప్రకటనతో తమకు ఎటువంటి సంబంధం లేదని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.వి.రమణమూర్తి, సెక్రటరీ ఎం.కృష్ణారావు, ఉపాధ్యక్షుడు ముద్దాపు నర్సింహం, పూర్వ అధ్యక్షుడు పప్పల కృష్ణమూర్తి, కార్యవర్గ, కార్యనిర్వాహక సభ్యులు స్పష్టం చేశారు. ద్వారకానగర్‌లోని కళా ఆస్పత్రిలో డాక్టర్ రమణమూర్తి ఆధ్వర్యంలో ప్రతినిధులు సమావేశమై ఈ ప్రకటనను ఖండించారు. ఈ సమావేశం కార్యనిర్వాహక సభ్యుల సమాచారంతో గానీ, అనుమతితో గానీ జరుగుతున్నది కాదన్నారు. ఆదివారం నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ఖారవేల అసోసియేషన్‌కు ఎటువంటి సంబంధం లేదని డాక్టర్ రమణమూర్తి, సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు.

స్పోర్ట్స్ మీట్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ తదితరులు

మురళీనగర్: ప్రాంతీయ స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు టెక్నికల్ ఎడ్యుకేషన్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ శనివారం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీని సందర్శించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర స్థాయి పోటీల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. డాక్టర్ బీవీ లక్ష్మణ రావు, డాక్టర్ కె.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్నతోనే సుపరిపాలన

మద్దిపాలెం: ప్రజలకు సుపరిపాలన అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. 290 సచివాలయం గాంధీనగర్‌లో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సీవో భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, జేసీఎస్ కన్వీనర్ అమర్‌రెడ్డి, డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, బి.తిరుమల రావు, మెట్ట దమయంతి, శ్యామ్, అప్పారావు, రత్నం, వరలక్ష్మి, లక్ష్మణ్, గణేష్ పాల్గొన్నారు.

పేదల పెన్నిధి ముఖ్యమంత్రి జగన్

టిడ్కో బ్లాక్ ప్రారంభోత్సవంలో కె.కె.రాజు


ఏఎస్సార్ నగర్‌లో టిడ్కో గృహసముదాయంలో నూతన బ్లాకును ప్రారంభిస్తున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: పేదల పాలిట పెన్నిధి, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు కొనియాడారు. 45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో నిర్మించిన టిడ్కో గృహసముదాయంలోని ఒక బ్లాకును శనివారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవలే ఏఎస్సార్ నగర్‌లో నూతనంగా నిర్మించిన ఆరు బ్లాకులను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించిన మిగిలిన మరో(బీ-1) బ్లాకును ప్రారంభించామన్నారు. సీఎం వైఎస్ జగన్ చొరవతో ఇక్కడ నివసించే పేదల సొంతింటి కల నిజమైందన్నారు. 2024లో మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిగా గెలిపించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతి ఒక్కరూ సీఎంకు మద్దతివ్వాలని కె.కె.రాజు కోరారు. అనంతరం ఈ ప్రాంతంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, పార్టీ నాయకులు హరిపట్నాయక్, గౌరీష్, సతీష్, నేపాల్ శ్రీను, గణపతి, సన్ని, నాయుడు, కాలనీ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు దొండపర్తి ఎరుకుమాంబ ఆలయం వెనుక వైపు గల వీధుల్లో డ్రైనేజీలు, కాలువల ఆధునికీకరణ, నిర్మాణాలకు శనివారం జీవీఎంసీ సిబ్బందితో కలసి కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.19.30 లక్షల జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సబ్బి నూకరాజు, ఆళ్ల శ్రీనివాస్, ఎస్.ప్రసాదరావు, వెంకటేష్, చిన్ని, శివ, సురేంద్రలాల్, గణేష్, రమణమూర్తి, జగన్, శ్రీనివాసరెడ్డి, వెన్నెల కృష్ణవేణి, పావని, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి శ్రీరామ అక్షింతల వితరణ


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: విశ్వహిందూ పరిషత్ విశాఖ మహానగరం ఆధ్వర్యంలో జనవరి 1 నుంచి 15 వరకు ప్రతి ఆలయంలో, ప్రతి ఇంటికీ అయోధ్య శ్రీరామ స్పర్శ అక్షింతలను పంపిణీ చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని తన కార్యాలయంలో శనివారం అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో బాలరాముడి నూతన విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేయనున్న సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ నిర్ణయం మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అయోధ్య శ్రీరామ మందిరంలో రాముడికి పూజ చేసిన అక్షింతలను వితరణ చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు, కులాలకు అతీతంగా.. ఆలయాలు, భజన బృందాలను కలుపుకుని అందరికీ అక్షింతలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


సంగీత(ఫైల్)

సీతమ్మధార: ఓ వివాహిత ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలెం శ్రీనివాసనగర్‌లో జి.చైతన్య, సంగీత(26) దంపతులు నివసిస్తున్నారు. వీరికి 2017లో వివాహమైంది. ఒక పాప ఉంది. సంక్రాంతి పండక్కి ఊరు తీసుకెళ్లామని భార్య సంగీత భర్తను కోరింది. తాను ఒక్కడే ఊరు వెళ్తానని అతడు చెప్పడంతో మనస్తాపం చెందిన ఆమె శుక్రవారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. శనివారం తెల్లవారుజామున భర్త చూసే సరికి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగతజీవిగా భార్య కనిపించింది. దీంతో వెంటనే అతడు ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే సంగీత చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి, భర్త చైతన్యను అదుపులోకి తీసుకున్నారు.

న్యాయం చేయండి

కంచరపాలెం: బాధితులకు అండగా ఉండాల్సిన పోలీసులు అవతలి పక్షం వారికి వత్తాసు పలుకుతూ తమకు న్యాయం చేయడం లేదని కప్పరాడకు చెందిన మేరుగు దిలీప్‌కుమార్ అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. తిక్కవానిపాలెం కమ్యూనిటీ హాల్‌లో శనివారం విలేకరుల సమావేశంలో అతడు మాట్లాడాడు. కప్పరాడ ప్రాంతంలో తమకు సంబంధించిన ఓ స్థలాన్ని కె.ఆర్.రావు అనే వ్యక్తి తన అధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాడన్నాడు. దీంతో అతడిపై గతంలో ఫిర్యాదు చేయగా.. కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు కేసు నమోదు చేయకుండా వత్తాసు పలుకుతున్నారని ఆరోపించాడు. రెండో సారి కూడా ఇలాగే ప్రయత్నించగా.. తాను స్పందనలో ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని చెప్పాడు. ఆ తర్వాత కంచరపాలెం పోలీసులు తమను స్టేషన్‌కు పిలిచి మాట్లాడినా.. కె.ఆర్.రావుపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నాడు. తనకు న్యాయం జరిగే వరకు పోరాడతానని, పోలీసులు అతడిపై చర్యలు తీసుకోవాలని దిలీప్‌కుమార్ కోరాడు. కార్యక్రమంలో రామారావు, అమ్మాజీరావు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల చాంపియన్స్‌కు అభినందన


విజేతలను అభినందిస్తున్న యల్లపు రఘురామ్, గొర్లె చందు

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన సీఎం కప్ బాక్సింగ్ ట్రోఫీ చాంపియన్‌షిప్ విజేతలైన విశాఖ జిల్లా జట్టును శనివారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, వీఎస్ విశాఖ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యల్లపు రఘురామ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించడమే కాకుండా రూ.లక్షల్లో ప్రైజ్ మనీ డిక్లేర్ చేసి క్రీడాకారుల్లో పోటీతత్వం పెంచుతున్న సీఎం వైఎస్ జగన్ ప్రశంసనీయుడని కొనియాడారు. విజేత జట్టు సభ్యులకు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వి.అమ్మోరు, సలహాదారుడు గొర్లె చందు, డాక్టర్ ఆర్‌వోసీ రూపెన్, కనకరాజు, సత్యనారాయణ, సునీల్, బి.ఎస్.వాసు, టి.వి.ఎస్.అనిల్‌కుమార్, సూర్యనారాయణ, తదితరులు అభినందనలు తెలిపారు.

మెట్ల పైనుంచి జారిపడిన చిన్నారి మృతి

మద్దిపాలెం: తలకు బలమైన గాయాలై చికిత్స పొందుతూ ఓ చిన్నారి మృతి చెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. దయానంద్ నగర్ చాకలిగెడ్డ ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న ఏడాది వయసు గల పరి కుమారి ఈ నెల 20న ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద ఆడుకుంటుండగా రెండో అంతస్తు మెట్ల మీద నుంచి జారి పడిపోవడంతో గాయాలై స్పృహ కోల్పోయింది. కుటుంబ సభ్యులు చిన్నారిని హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. శనివారం ఉదయం 9.10 గంటల ప్రాంతంలో పాప మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. పరి కుమారి తండ్రి రవీను కుమారు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ సతీష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

మురళీనగర్ వాకర్స్ క్లబ్‌కు అవార్డుల పంట


ఉత్తమ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడి అవార్డు అందుకుంటున్న పల్లా చంద్రమౌళి

మురళీనగర్: ఏయూ కన్వెన్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ వాకర్స్ మహా సమ్మేళనంలో ప్రతిభ ఆధారితంగా ఇచ్చే పురస్కారాలతో మురళీనగర్ వాకర్స్ క్లబ్ మెరిసి మురిసింది. క్లబ్‌ల విభాగాలతోపాటు ఇతర విభాగాల్లో 8 అవార్డులు అందుకుంది. క్లబ్ విభాగంలో ఉత్తమ వాకర్స్ క్లబ్, ఉత్తమ ఎంజీఎఫ్(సెకండ్ హైయ్యస్ట్ క్లబ్), ఉత్తమ శాశ్వత ప్రాజెక్టు క్లబ్, ఉత్తమ ఆరోగ్య సేవా క్లబ్‌తో పాటు వ్యక్తిగత విభాగాల్లో ఉత్తమ అధ్యక్షుడు, సర్వీస్ అప్రిసియేషన్ అవార్డులను పల్లా చంద్రమౌళి, ఉత్తమ బులెటిన్ ఎడిటర్‌గా ఎన్.బుచ్చయ్య(90), ఉత్యమ వాకథాన్‌గా ఎల్‌వీ సుధాకర్ అవార్డులు అందుకున్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ రవీంద్ర చేతుల మీదుగా వీరు ఈ అవార్డులు స్వీకరించారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు


పూజలు ప్రారంభిస్తున్న నూకల శేషగిరిరావు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మాలధారులకు అన్నదానం..

ధ్యాన మందిరంలో వివిధ మాలధారులకు నిర్వహిస్తున్న ప్రత్యేక అన్నదానం శనివారం ఏకాదశి రోజుతో ముగిసిందని, భక్తులు, దాతలు సహకారంతో ఈ కార్యక్రమాన్ని సంక్రాంతి వరకు పొడిగిస్తున్నట్లు నూకల శేషగిరిరావు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 15 వేల మంది మాలధారులు అన్నదానంలో పాల్గొన్నారన్నారు. వీరికి ప్రతీ రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రత్యేక అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు.

క్రిస్మస్ సందడి

జోరుగా స్టార్లు, ట్రీలు, డెకరేషన్ సామగ్రి విక్రయాలు


సీతమ్మధారలో శాంతా క్లాజ్ బొమ్మలు

క్రిస్మస్ పండగ సందడి మొదలైంది. మార్కెట్లలో వివిధ రకాల స్టార్లు, క్రిస్మస్ ట్రీలు, శాంతా క్లాజ్ (క్రిస్మస్ తాత) బొమ్మలు, వస్త్రాలు, డెకరేషన్ సామగ్రి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సీతమ్మధారలోని పలు దుకాణాలు క్రిస్మస్ డెకరేషన్ సామగ్రి విక్రయాలతో కళకళలాడుతున్నాయి. ఈ నెల 25వ తేదీ క్రిస్మస్ పర్వదినాన క్రైస్తవులంతా కుటుంబ సమేతంగా చర్చిలకు వెళ్లి ఏసుక్రీస్తుకు ప్రత్యేక ప్రార్థనలు చేసి వేడుక చేసుకుంటారు. ముందుగా తమ ఇళ్లను అందంగా అలంకరించుకుంటారు. క్రైస్తవులు దీన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఈ నేపథ్యంలో క్రిస్మస్ సామగ్రి విక్రయాలు ఊపందుకున్నాయి. మార్కెట్లో వివిధ రకాల సైజుల్లో క్రిస్మస్ ట్రీలు, రంగురంగుల స్టార్లు, చిరుగంటలు, చిన్నచిన్న గాజు గోళాలతో చేసిన బొమ్మలు, కలర్ బాల్స్, జింగిల్ బెల్స్ మొదలగు సామగ్రి లభ్యమవుతున్నాయి. వాటి కొనుగోళ్లలో క్రైస్తవులు బిజీబిజీగా ఉన్నారు. దీంతో దుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

– సీతమ్మధార


ఆకర్షణీయంగా పలు రకాల స్టార్స్


పశువుల పాకలో క్రీస్తు జననం బొమ్మల సెట్